క్లుప్తంగా

వృద్ధుడికి తీవ్రగాయాలు

కంచికచర్ల: ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో ఓ వృద్ధుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గండేపల్లిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గండేపల్లి గ్రామానికి చెందిన మామిడి యల్లమందకు గతంలో పక్షవాతం రావడంతో మంచానికి పరిమితమయ్యాడు. ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. చుట్ట కాల్చుకుని అగ్గిపుల్లను బయట పడేసేక్రమంలో అదికాస్తా దుప్పటికి అంటుకుని మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో అతని శరీరం కూడా కాలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనం ద్వారా అతన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవాడ సెంటినీ ఆసుపత్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ శనివారం తెలిపారు. ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని ప్రజలకు బీపీ, షుగర్, కిడ్నీ పరీక్షలు, ఈసీజీ, ఊపిరితిత్తులు, కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. అవసరమైనవారికి మందులు అందజేస్తారన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోరారు.

సీమపందుల పెంపకానికి రాయితీలు



ముక్త్యాల(జగ్గయ్యపేట):ముక్త్యాలలోని సీమ పందుల పెంపకం కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు హనుమంతరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ పందుల పెంపకం చేపట్టేవారికి ప్రత్యేక రాయితీలు అందిస్తున్నట్లు వివరించారు. సీమ పందులకు సకాలంలో టీకాలు వేయటంతోపాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సీమపందుల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు ఈ కేంద్రం నుంచి వాటిని సరఫరా చేస్తారని వివరించారు. కార్యక్రమంలో కేంద్రం ఏడీ శ్రీనివాసరావు, జగ్గయ్యపేట పశుసంవర్ధకశాఖ ఏడీ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



జగ్గయ్యపేటఅర్బన్: మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. పట్టణంలోని14వ వార్డు విలియంపేటలో ఎమ్మెల్యే తాతయ్య శనివారం పర్యటించారు. విలియంపేటలో మంచినీటి సరఫరా సజావుగా జరుగుతున్నదీ, లేనిదీ వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామటౌన్(నందిగామ రూరల్): సీఎంఆర్ఎఫ్ నుంచి 42మందికి మంజూరైన రూ.38.98 లక్షల చెక్కులను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ వైద్యఖర్చుల భారం నిరుపేదలపై పడకూడదనే ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న జీఎం బెల్లంకొండ ప్రసాద్

నందిగామరూరల్: మహిళలు కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని పీఎస్‌సీ బోస్ మెమోరియల్ ట్రస్ట్ జీఎం బెల్లంకొండ ప్రసాద్ సూచించారు. మండలంలోని మునగచర్ల గ్రామంలోని పీఎస్‌సీ బోస్ డ్రైవింగ్ స్కూల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే కుటుంబం ఆర్థికంగా మరింత ఉన్నతస్థితికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ మణికుమార్, మేనేజర్ సుభాని, ట్రైనర్ బుజ్జి, మహిళలు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న పెనుగంచిప్రోలు-ముచ్చింతాల రోడ్డు



కంకర తేలి గుంతలుపడిన ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డు



ప్రమాదకరంగా మారిన గుమ్మడిదుర్రు వద్ద వాగుపై రోడ్డు

దారుణంగా రహదారులు

పెనుగంచిప్రోలు: గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరదలకు దెబ్బకు మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా మారాయి. తుఫాను కారణంగా వచ్చిన వరదలకు పలురోడ్లు కొట్టుకుపోగా, తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా కంకర, మట్టిపోసి రోడ్లపై రాకపోకలను పునరుద్ధరించారు. అయితే ప్రస్తుతం కంకరంతా పైకి తేలిపోవడంతో ఈ రోడ్లపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఈరోడ్లలో ప్రయాణ సమయంలో ద్విచక్రవాహనదారులు కిందపడిపోతూ గాయపడుతున్నారు. గుమ్మడిదుర్రు గ్రామం ముందు వరదకు వాగుపై కల్వర్టు కొట్టుకుపోగా తాత్కాలికంగా తూములు వేసి మట్టిపోసి రాకపోకలు సాగిస్తున్నారు. అక్కడ వాహనాలు ఏమాత్రం రోడ్డు అంచుకు వచ్చిన ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా రోడ్లు, గుమ్మడిదుర్రు కల్వర్టుకు మరమ్మతులు చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు .



కంకర మొనతేలిన అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు రోడ్డు

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

జగ్గయ్యపేటఅర్బన్: గతనెల 20వతేదీ నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన దక్షిణ భారత జాతీయస్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని విజేతలుగా నిలిచిన జగ్గయ్యపేట జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ శనివారం అభినందించారు. పేట బాలుర హైస్కూల్ తరపున పాల్గొన్న విద్యార్థులు భార్గవ్, చైతన్య 'వరదల్లో వంతెనలు ఏ విధంగా నిర్మించుకోవాలి, వాహనాలను, ప్రజలను ఏ విధంగా రక్షించుకోవాలి' అనే ప్రాజెక్టు ప్రదర్శించి దక్షిణ భారత స్థాయిలో విజేతలుగా నిలిచారు. గంపలగూడెం మోడల్ స్కూల్ విద్యార్థి సుదక్ష రోలింగ్ రోబో ప్రాజెక్టు ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన జగ్గయ్యపేట, గంపలగూడెం విద్యార్థులను కలెక్టర్ అభినందించినట్లు పేట విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ.సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ కూడా విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భర్త మరణం జీర్ణించుకోలేక భార్య మృతి



కంచికచర్ల: భర్త మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనస్తాపానికి గురై భార్య కూడా మృతిచెందిన ఘటన కంచికచర్లలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కంచికచర్లలోని చెవిటికల్లు రోడ్డులో ఉంటున్న అయిలపోగు నాగేశ్వరరావు(90) గత నెల 28వ తేదీన అనారోగ్యంతో మృతిచెందగా, భర్త మృతిని జీర్ణించుకోలేని భార్య సంపూర్ణ(80) అదేరోజున మతిస్థిమితం కోల్పోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను వైద్యచికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్న ఆమె శనివారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి నలుగురు కుమారులు ఉన్నారు. ఈవిషాద సంఘటనతో అయిలపోగు సంపూర్ణ కుటుంబసభ్యులతోపాటు స్థానికులు శోకసముద్రంలో మునిగిపోయారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు



బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో శుకశ్యామలాంబ అమ్మవారు



కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

నందిగామ టౌన్(నందిగామ రూరల్):పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించి కుంకుమార్చన చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ ప్రతిష్ఠాపన, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, అస్తమంటపారాధన తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. సంతానం లేని వారికి పూజల అనంతరం నంది ముద్దలు అందజేశారు. రాత్రికి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో గంగాధర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ మీట్

నందిగామటౌన్(నందిగామరూరల్): స్థానిక కాకతీయ అపోలో విద్యాసంస్థల్లో శనివారం స్పోర్ట్స్ మీట్, మాతృవందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. తమ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు చదువుతోపాటు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ పిల్లలు అడిగే కోర్కెలలో ఏది అవసరమో అంతవరకే అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గతేడాది పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన కామా స్వప్నిక, సంద్ర శరణ్య లక్ష్మి, కోమటి హర్షిత్‌లకు బంగారు బహుమతులను అందించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కాపా భారతి, కార్తికేయ, అన్నవరపు బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపా రవీంద్రనాథ్

మద్యం దుకాణాలకు 130 దరఖాస్తులు

జగ్గయ్యపేట: గీత కార్మికుల కోసం జగ్గయ్యపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేటాయించిన మూడు షాపులకు గడువు ముగిసే సమయానికి మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య శనివారం తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని షాపునకు 19దరఖాస్తులు, వత్సవాయి మండలంలోని షాపునకు 31 దరఖాస్తులు, జగ్గయ్యపేట మండలంలోని షాపునకు 22 దరఖాస్తులు కలిపి మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

నందిగామలో..

నందిగామరూరల్: నందిగామ ఎక్సైజ్‌శాఖ పరిధిలోని ఒక షాపునకు మొత్తం 31 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ బంగార్రాజు శనివారం తెలిపారు. లాటరీ పద్ధతిలో షాపును కేటాయిస్తామని వివరించారు.

కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలో..

కంచికచర్ల: వీరులపాడు మండలంలో గీత కులాలకు కేటాయించిన మద్యం షాపునకు గడువు ముగిసే సమయానికి 27దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసాబేగం శనివారం తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 9గంటలకు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో లాటరీ నిర్వహించి షాపును కేటాయిస్తామని సీఐ వివరించారు.

జున్ను గడ్డి దగ్ధం

చందర్లపాడు(నందిగామరూరల్): చందర్లపాడు మండలం ముప్పాళ్లలోని పంట పొలాలలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ రైతు గతపంట తాలూకా వ్యర్థాలను తగలబెట్టేందుకు నిప్పటించగా, పక్కనే ఉన్న మరోరైతు నల్లాని రామారావు సాగు చేస్తున్న జున్నుగడ్డి స్వల్పంగా దగ్ధమైంది. పొలాల్లోని రైతులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



నందిగామటౌన్(నందిగామ రూరల్): ఢిల్లీలో బీజేపీ భారీ విజయాన్ని సాధించడాన్ని హర్షిస్తూ స్థానికులు బీజేపీ నాయకులు గాంధీ సెంటరులో శనివారం టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, పట్టణ అధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు కేదార్‌నాద్ శర్మ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు, గోనెల సత్యనారాయణ, బాదర్ల ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకట నారాయణ, కృష్ణ, లక్ష్మణ్, శివ, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, స్వామి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడులో విచ్చలవిడిగా మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని పలు షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పగలు, రాత్రి లేకుండా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. మద్యం సేవించిన వారు ఆయా ఖాళీసీసాలు, గ్లాసులను సైడ్‌కాల్వలో పడేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రామాలయం సెంటర్‌లో మద్యం సీసాలు, గ్లాసులతో నిండిపోయిన సైడ్‌కాల్వ

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీష్మ ఏకాదశి, రెండో శనివారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. భీష్మ ఏకాదశి నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. నూతన వధూవరులు పెళ్లి దుస్తులపై ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెళ్లి బట్టలపై వచ్చిన నూతన వధూవరులకు ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు. అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చనలో 22 మంది, చండీ హోమంలో 67 మంది, లక్ష కుంకుమార్చనలో 8 మంది, శ్రీచక్రనవార్చనలో 9 మంది, ఇతర సేవల్లో 330 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ, పంచహారతుల సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



ధాన్య మందిరంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి విగ్రహం



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కొణతమాత్మకూరు(నందిగామరూరల్): శ్రీకృష్ణ సహిత మహాగణపతి విగ్రహ వాయు ప్రతిష్ఠా మహోత్సం సందర్భంగా మండలంలోని కొణతమాత్మకూరులో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గ్రామంలోని వేజండ్ల కోటయ్య సహిత అభయాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని ధాన్య మందిరంలో శనివారం ఉదయం 7.30 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజలతోపాటు లక్ష్మీనారాయణ శాంతికల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, తంగిరాల సౌమ్య, కాలుష్య నియంత్రణ మండలి సంస్థ చైర్మన్ కృష్ణయ్య, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకటరాజేష్, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఏపీ రిటైర్డ్ ఐజీ తాతినేని యోగానందం, సచివాలయ డిప్యూటీ సెక్రటరీ రామసుబ్బయ్య, హైదరాబాద్‌కు చెందిన రఘురాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ ఏఎస్ ఆనందరావు, నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ మేడా కోటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు మేడా రాధాకృష్ణ, జవ్వాజి భాస్కరరావు, వేజండ్ల అర్జునరావు, మన్నేపల్లి వినయ్, మువ్వా రామారావు ప్రముఖులకు స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు, వేజండ్ల రవీంద్రబాబు రామాయణ మహాగ్రంథాన్ని అందజేశారు. అనంతరం భారీ అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు

ఎక్సైజ్ సీఐ అఫ్రపున్నీసా బేగం

కంచికచర్ల: విద్యార్థులు ఎంత కష్టమైన పాఠ్యాంశాన్ని అయినా ఇష్టపడి చదివితే మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అఫ్రపున్నీసాబేగం సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నైతిక విలువలు-వాటి ఆవశ్యకత'అనేఅంశంపై విద్యార్థులకు శనివారం ఆమె అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అఫ్రపున్నీసాబేగం మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారు చూపినమార్గంలో నడవాలన్నారు. కష్టపడి చదువుకుని ఉన్నతరంగాల్లో స్థిరపడాలన్నారు. శాస్త్రీయ విధానంలో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. నైతిక విలువలతో నడుచుకోవాలని సూచించారు. మత్తుపదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, సేవించే వారి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాను గతంలో ఐదేళ్లపాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేశానని, విద్యార్థులకు పాఠాలు చెప్పడమంటే తనకు ఎంతో ఇష్టమని వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేల్, ఎక్సైజ్‌శాఖ సీఐ గాలిబ్‌సాహెబ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ సీఐ అఫ్రపున్నీసాబేగం

హెల్మెట్ ధారణ-ప్రాణానికి రక్షణ

నందిగామటౌన్(నందిగామ రూరల్):హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ అనే అంశాన్ని గుర్తుంచుకుని ద్విచక్రవాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలని నందిగామ రవాణాశాఖాధికారి పద్మావతి సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ఆర్టీవో కార్యాలయం, చందర్లపాడు బస్టాండ్, జెడ్పీ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాలలో డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పించారు. తొలుత రవాణా శాఖ కార్యాలయం నుంచి అనాసాగరం వరకు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడిపి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో ప్రమాద సమయాలలో తీవ్రత అధికంగా ఉంటుందని చెప్పారు. ప్రయాణాల సమయంలో ఆయా వాహనదారులు సంబంధిత రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణిమ, మోటార్ వాహన డీలర్లు, డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో పద్మావతి

గ్రామాభివృద్ధికి రామ్‌కో సహకారం

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామాభివృద్ధికి రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం తనవంతు సహకారం అందిస్తుందని రామ్‌కో ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ అన్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షలతో జయంతిపురంలో 35వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన మంచినీటి ట్యాంకును శనివారం ఆయన గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా యాజమాన్యం మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసిందన్నారు. గ్రామంలోని సమస్యలను ప్రజలు యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం ఫరూక్‌మహ్మద్, మైన్స్ జీఎం జాన్‌రెడ్డి, ప్రతినిధులు రాజాకేశవప్రసాద్, సీతారామయ్య, కెశవపెరుమాళ్లు, రామకృష్ణసాయి, రఘురాం, సురేష్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

బండిపాలెం(జగ్గయ్యపేట): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కోడ్ ఉల్లంఘిస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చి పది రోజులైనప్పటికీ గ్రామంలోని ఆయా రాజకీయపార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. ఈక్రమంలో ప్రధాన సెంటరులోని ఓ రాజకీయ నాయకుడి విగ్రహానికి ముసుగు వేయకుండా కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు